నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 9-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:109 పేజీలు:4 వెల: రూ.1/-

తెలంగాణలో సంపూర్ణంగా భారత్‌బంద్

బందు పిలుపుతో ఆందోళనలకు దిగిన టిఆర్ఎస్ శ్రేణులు
పలుచోట్ల నిరసనలు, బైక్ ర్యాలీలు, దిష్టిబొమ్మ దహనాలు
బూర్గుల టోల్‌గేట్ వద్ద ఆందోళనలో పాల్గొన్న కెటిఆర్
వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పిలుపు

హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు మద్దతు ఇచ్చిన అధికార టీఆర్ఎస్ పార్టీ ఆందోళనలకు దిగింది. రైతులు తలపెట్టిన భారత్ బంద్‌కు టీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతిచ్చింది. దీంతో టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రైతులకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు ఆందోళనలకు దిగారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టణ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. జాతీయ రహదారులను దిగ్బంధించారు. ప్రధాన కూడళ్లలో రాస్తారోకోలు నిర్వహించి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారు. రైతులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో ర్యాలీలు నిర్వహించారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. దుకాణ సముదాయాలు కూడా తెరుచుకోలేదు. అన్ని రంగాల వారు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. దీంతో అనేక చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతుల తరపున దీర్ఘకాలికంగా పోరాడేందుకు టీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతులకు ఎవరు ద్రోహం చేసినా టీఆర్ఎస్ ఎండగడుతుందని స్పష్టం చేశారు. షాద్‌నగర్ బూర్గుల టోల్‌గేట్ వద్ద రైతులకు మద్దతుగా కేటీఆర్, కెకె, శ్రీనివాసగౌడ్, మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితరులు భారత్ బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కడుపు మండిన రైతన్నలు గత 13 రోజులుగా ఢిల్లీ పురవీధుల్లో, ఎముకలు కొరికే చలిలో, కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తున్నారు. ఈ దేశానికి న్నం పెట్టే రైతు బాగుంటేనే మనమంతా బాగుటుంది. ఎద్దు ఏడ్చిన ఎవసం బాగుండదు.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు.. కానీ దేశ వ్యాప్తంగా రైతన్నలు కన్నీరు పెడుతున్నారు. రైతన్న ఏడ్వడం ఈ దేశానికి, ఏ ప్రభుత్వానికి మంచిది కాదు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల వైపే మొగ్గు చూపుతుంది. కానీ కర్షకుల వైపు మొగ్గు చూపకుండా.. వారి నెత్తిపై మూడు నల్లచట్టాలను రుద్దుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజాస్వామ్య స్ఫూర్తి లేదని అర్థమందని కెటిఆర్ అన్నారు. మార్కెట్ కమిటీలను రద్దు చేస్తామనడం సరికాదు. దేశంలో 85 శాతం మంది రైతులు చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఈ చిన్న, సన్నకారు రైతులు కార్పొరేట్ శక్తులతో పోరాడలేరు. ఈ బిల్లుల వల్ల రైతులకే నష్టం కాదు.. మధ్యతరగతి ప్రజల నడ్డి కూడా విరుస్తుందని దుయ్యబట్టారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నకు సున్నం పెడుతున్న వైనాన్ని ఈ దేశ ప్రజలందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం అందరం అండగా నిలవాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు టీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతోందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు సంఘీభావం తెలపాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు నచ్చకపోతే నిరసన తెలిపే హక్కు ప్రజలకు ఉంటుందన్నారు. పార్లమెంట్‌లో మందబలంలో సాగు బిల్లులను ఆమోదింప జేసుకున్నారు. సాగు బిల్లులకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్లమెంట్‌లో పోరాడిందని గుర్తు చేశారు.

పీజీ సీటు ఇవ్వనందుకు విద్యార్థికి పదిలక్షల పరిహారం
కామినేని మెడికల్ కాలేజీకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): మెడికల్ పీజీలో ఓ విద్యార్థినికి ప్రవేశం నిరాకరించినందుకు గాను రూ. 10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని హైదరాబాద్‌కు చెందిన కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ హేమంత్ గుప్తాతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. మోతుకూరి శ్రీయ కౌముది అనే విద్యార్థిని ఈ విద్యా సంవత్సరంలో నీట్ పరీక్ష రాసి అర్హత సాధించారు. ప్రవేశ అర్హత సాధించిన అనంతరం ఎంఎస్ సర్జన్ కోర్సులో ప్రవేశం నిమిత్తం కళాశాలకు సకాలంలో చేరుకున్నా ఆమెకు సదరు కళాశాల ప్రవేశం నిరాకరించింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు అనుకూలంగా తీర్పునిస్తూ తనకు ప్రత్యేక సీటు కేటాయించాలని కళాశాలను ఆదేశించింది. ఆ తీర్పును నేషనల్ మెడికల్ కమిషన్ సవాల్ చేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు ధర్మాసనం 'కౌముదికి వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశం కల్పించాలి'అని తీర్పునిచ్చింది.

బంద్‌కు మద్దతుగా తెలంగాణలో కాంగ్రెస్ ఆందోళన
పలు చోట్ల ధర్నాలు,ర్యాలీల్లో పాల్గొన్న నేతలు

హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): రైతులకు వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన బిల్లులను వెంటనే రద్దు చేయాలని రైతులు ఇచ్చిన భారత్ బంద్‌కు మద్దతుగా కాంగ్రెస్ రాష్ట్రవ్యాపం÷-తంగా ఆందోళనలు చేపట్టింది. ఆయా జిల్లాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో నేతలు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రైతులు దేశవ్యాప్తంగా నిరసన, ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి హనుమంతారావ్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలు రైతులకు మద్దతు తెలుపుతూ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కండువాలు మోసి పార్టీకి సేవ చేసిన నాయకులను కాదని ఇతర పార్టీ నుంచి వచ్చిన రాములమ్మను స్టార్ క్యాంపైనర్‌గా బాధ్యతలు ఇచ్చామన్నారు. ఆ అదృష్టం ఎవరికి రాదని, కాంగ్రెస్ పార్టీలో కోవర్ట్‌లు ఉన్నారని, పార్టీ పదిలిపెట్టినప్పుడు మీకు తెలిసిందా? అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక బిల్లును ఉపసంహరించు కునేంతవరకు కాంగ్రెస్ పార్టీ దేనికైనా సిద్ధమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బిల్లు వలన కార్పొరేట్ వ్యవస్థలకు లాభమే కానీ రైతుకు మాత్రం ఉరిశిక్ష వేసినట్లే అని ఆయన వ్యాఖ్యానించారు. ఇకపోతే బంద్‌లో భాగంగా బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై టీఆర్ఎస్ నేతలు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను నేతలు దహనం చేశారు. బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై అఖిలపక్షం నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో రాజీవ్ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై అధికారపక్షం, అఖిలపక్షం ఆధ్వర్యంలో పోటాపోటీగా ఆందోళనలు కొనసాగాయి. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను, అఖిలపక్షం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఎంపీ రేవంత్‌రెడ్డి ధర్నాలో ప్రమాదం తప్పింది. షాద్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి ధర్నా నిర్వహిస్తుండగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ధర్నా సమయంలో పార్కింగ్ స్థలంలోని వున్న కారులో మంటలు చెలరేగాయి. బాణసంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు పడి కారు దగ్ధమైంది. వెంటనే స్థానికులు, కాంగ్రెస్ కార్యకర్తలు మంటలను అదుపుచేశారు. దాంతో అక్కడ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఏదెమైనా పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. నల్గొండ జిల్లా కేతెపల్లిలో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. హైద్రాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్నారు. నూతన వ్యవసాయ చట్టానికి వ్యతిరేకంగా నిరసనకు దిగారు. నల్లగొండకు వెళ్తున్న మంత్రి జగదీష్ రెడ్డి కాన్వాయ్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. టీఆర్ఎస్ పై సీఎల్పీ నేత భట్టి విక్రమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ బంద్‌కు టీఆర్ఎస్ మద్దతు కంటి తుడుపు చర్య అని భట్టి విక్రమార్క మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌కు రైతుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్ర చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన సూచించారు. దేశమంతా ఆందోళనలో ఉంటే.. కేసీఆర్ మాత్రం ఫాంహౌస్‌లో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమాన్ని మించి రైతు ఉద్యమం
దేశవ్యాప్తంగా రైతు ఉద్యమానికి కెసిఆర్ నాయకత్వం
కేంద్రం మెడలు వంచేందుకు సిద్ధం అవుతున్నారన్న తలసాని

హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): రైతుల ఉద్యమానికి సీఎం కేసీఆర్ నాయకత్వం వహిస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బంద్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రైతు ఉద్యమం.. తెలంగాణ ఉద్యమం మాదిరి టర్న్ తీసుకోబోతోందన్నారు. సన్నాల కొనుగోలుకు క్లియరెన్స్ ఇవ్వాల్సింది కేంద్రమేనన్నారు. రైతుబంధు పథకంపై బీజేపీ వాళ్ళు అవగాహన లేకుండా మట్లాడుతున్నారన్నారు. ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన సందర్భం వేరన్నారు. కార్పొరేట్ కంపెనీల మేలు కోసమే ఎన్డీఏ రైతు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తోన్న రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రైతుల కోసమే అధికారంలో ఉన్నప్పటికీ బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని తలసాని తెలిపారు.రైతు వ్యతిరేక చట్టాలతో కేంద్రం వ్యవసాయన్ని కార్పొరేట్ వ్యవస్థలకు దారాదత్తం చేసే ప్రయత్నం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. దేశానికి రైతు వెన్నెముక అని, దేశ వ్యాప్తంగా రైతన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని అన్నారు. వ్యవసాయ చట్టాలతో రైతులు నడ్డి విరుగుతోందని, రాజ్యసభలో అన్ని పార్టీలు వ్యతిరేకించినా చట్టాలను ఆమోదించుకున్నారని దుయ్యబట్టారు. సంఖ్యా బలం ఉందని ఈ నల్ల చట్టాలను తీసుకొచ్చారని, చట్టాలను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో రైతులను ఆదుకున్న ప్రభుత్వం టీఆర్ఎస్ మాత్రమే అని ఆయన గుర్తు చేశారు.

ఇప్పటికైనా కేంద్రం దిగి వచ్చి, జీఎస్టీని మార్చలేదా? దేశంలో రైతుల పరిస్థితి తీవ్రంగా మారుతుందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర లేదు.. తెలంగాణలో పండిన పంట దేశంలో వేరే చోట అమ్ముకోవాలంటే ఎలా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతాంగం కోలుకుంటుందని గుర్తుచేశారు. ఎవర్ని పెంచి పోషించడం కోసం ఈ చట్టాలు తీసుకువచ్చారని ప్రశ్నించారు. పంజాబ్, హరిహాణలో ఇంత ఉధృతంగా ఎందుకు జరుగుతుందో ఆలోచించుకోవాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కేంద్రం మెడలు వంచుతామని, రైతాంగంతో డ్రామాలు ఆడితే మీ అధికార పీఠం కదులుతుందన్నారు. కొంతమంది మూర్ఖులు అనవసరంగా మాట్లాడుతున్నారని, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ టీఆర్ఎస్ ఓడిపోయింది కాబట్టి భయపడుతోందన్నారు. కానీ, ఇలాంటి రాజకీయాలు, ఎన్నికలు తాము ఎన్నో చూశామని అన్నారు. రైతులు నిరసన చేస్తుంటే రాజకీయ పార్టీలపై నెడుతున్నారని అన్నారు. చట్టాలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం అవుతుంది అధికారం శాశ్వతం కాదని హెచ్చరించారు. నిజంగా సమస్య లేకపోతే కేంద్రం ఎందుకు చర్చలు జరుపుతుందని నిలదీశారు. రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేస్తుందో ఒకసారి గమనించాలన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను కేంద్రం పరిగణలోకి తీసుకుందని గుర్తు చేశారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదని మండిపడ్డారు. నేటి భారత్ బంద్‌కు వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

రైతులను మోసం చేసిన ఏకైక సిఎం కెసిఆర్: రాజాసింగ్

హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): రైతులను మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల భూములను కబ్జా చేసి వెంచర్లు వేసిన ఘనత మంత్రి కేటీఆర్‌దని విమర్శించారు. రైతు చట్టాన్ని అర్థం చేసుకోవడంలో ప్రతిపక్షాలు విఫలమయ్యాయన్నారు. కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలు ఎంతో మేలు చేసేవని రాజాసింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కొందరు మధ్యవర్తులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని ఎదుర్కోలేకే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్వరలోనే దేశంలో 5జి సేవలు
ఇందుకోసం కలసికట్టుగా శ్రమించాలి: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,డిసెంబర్ 8(ఆర్ఎన్ఎ): భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని, లక్షలాది మంది భారతీయులను బలోపేతం చేసేందుకు..త్వరలోనే 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కలిసికట్టుగా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. మొబైల్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి మంగళవారం ప్రధాని మోదీ ప్రసంగించారు.

మీలాంటి వారి ఆవిష్కరణలు, ప్రయత్నాల వల్లే మహమ్మారి కాలంలోనూ ప్రపంచం సజావుగా సాగుతోందన్నారు. టెక్నాలజీలో వచ్చిన అప్‌డేట్ వల్ల.. హ్యాండ్‌సెట్ల నుంచి గ్యా÷- జడెట్లకు మారామని, అయితే ఎలక్ట్రానిక్ వ్యర్థాల అంశంలో టెక్నాలజీ పరిశ్రమకు చెందిన టాస్క్‌ఫోర్స్ ఏదైనా ఆలోచించా లన్నారు. టెలికం పరికరాలను, డిజైన్, డెవలప్మెంట్, ఉత్పత్తి విషయంలో భారత్‌ను ప్రపంచంలోనే టెలికాం హబ్‌గా మార్చాలని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. మొబైల్ టెక్నాలజీ వల్ల కోట్లల్లో క్యాష్‌లెస్ లావాదేవీలు జరుగుతున్నాయని, దీని వల్ల పారదర్శకత పెరుగుతుంద న్నారు. టోల్‌బూత్‌ల వద్ద కూడా కాంటాక్ట్‌లెస్ సేవలు సాధ్యమైనట్లు చెప్పారు.

రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర చట్టాలు
ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

కామారెడ్డి,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కెసిఆర్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం రైతలను నట్టేట ముంచేలా చేస్తోందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతులకు వ్యతిరేకమని పేర్కొన్నారు. వ్యవసాయ చట్టాల వల్ల రైతులకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతులకు వ్యతిరేకం. వ్యవసాయ చట్టాల వల్ల రైతులకు భారీ నష్టం. నూతన చట్టంలో కొత్త సాగు బిల్లులకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు ఓటేసిందన్నారు. కనీస మద్దతు ధర విషయంలో కేంద్రం హామీ ఇవ్వలేకపోయింది. కార్పొరేట్ శక్తులు కృత్రిమ కొరత సృష్టించి మార్కెట్‌ను శాసిస్తాయి. రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా రైతులను కేసీఆర్ ఆదుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయం విషయంలో రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. సన్న రకాలకు మద్దతు ధర ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కానీ సన్నరకాలకు మద్దతు ధర అన్న అంశాన్ని చేర్చకపోవడం అభ్యంతరకరం. మద్దతు ధరలు ప్రకటించకపోతే ప్రైవేటు వ్యక్తులు సిండికేట్‌గా మారి... రైతులకు తక్కువ ధర చెల్లించి మోసం చేసే అవకాశం ఉందని అన్నారు. కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు తలపెట్టిన భారత్ బంద్‌లో భారీ ఎత్తున టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మద్దతు ధర ఇవ్వకుండా కేంద్రం అడ్డం పడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. టోల్‌గేట్ వద్ద ధర్నాతో వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

కామారెడ్డి జిల్లా టెక్రియల్ చౌరస్తా వద్ద నిర్వహించిన రైతుల ధర్నాలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో పాటు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ కవిత.. టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కొత్త వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ బ్లాక్ బెలూన్స్‌ను గాల్లోకి వదిలేశారు.

ప్రశాంతంగా ముగిసిన భారత్ బంద్
ఢిల్లీలో కదం తొక్కిన కర్షకులు
పంజాబ్‌లో బంద్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు
బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో ప్రభావం చూపిన బంద్
రాస్తారోకోలు..ధర్నాలు నిర్వహించిన రాజకీయ పార్టీలు
పలు రాష్ట్రాల్లో కదం తొక్కిన లెఫ్ట్ కార్మిక సంఘాల నేతలు

న్యూఢిల్లీ,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు తలపెట్టిన భారత్ బంద్ విజయవంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. బిజెపియేతర పాలిత ప్రాంత రాష్ట్రాల్లో బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భారత్ బంద్ కొనసాగింది. భారత్ బంద్‌లో 25 రాజకీయ పార్టీలతో పాటు ఉద్యోగ, కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. రైతులకు మద్దతుగా దేశ వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కొత్త వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతులతో పాటు ఆయా పార్టీల నాయకులు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలు రాష్ట్రాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే రాస్తారోకోలు, ప్రదర్శనలు నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీ పొలిమేర్లలో రైతులు కదంతొక్కారు. లక్షల మంది రైతులు కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు ఐదు సార్లు కేంద్రంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో రైతులు బంద్‌కు పిలుపు ఇచ్చారు. కాగా రైతు సంఘాల నేతలతో కేంద్రం బుధవారం మరోసారి చర్చలు జరపనుంది. రైతుల డిమాండ్లను ప్రభుత్వం ఇంతవరకు తిరస్కరిస్తూ వచ్చింది. రైతులు సూచించిన సవరణలను చేస్తామని, రద్దు అసాధ్యమని చర్చల్లో పాల్గొన్న కేంద్ర మంత్రులు స్పష్టం చేశారు. పంజాబ్‌లో బంద్ సంపూర్ణంగా కొనసాగింది. అమృత్‌సర్‌లో రైతు, కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన చేపట్టాయి. మొహాలీలో టోల్‌ప్లాజాలను అధికారులు మూసివేశారు. ఒడిశాలోనూ ఆందోళనలు కొనసాగాయి.

ఒడిశాలో వామపక్షాలు, కార్మిక, రైతు సంఘాలు బంద్‌లో పాల్గొన్నాయి. భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో నిర్వహించారు. మహారాష్ట్రలో పలు ఉద్యోగ, కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొన్నాయి. స్వాభిమాని శెట్కారి సంఘటన రైతు సంఘం ఆధ్వర్యంలో రైల్‌రోకో నిర్వహించారు. బుల్దానా జిల్లా మల్కాపూర్ రైల్వేస్టేషన్ ట్రాక్‌పై రైతులు నిరసన వ్యక్తం చేశారు. బెంగాల్‌లోని జాదవ్‌పూర్‌లో వామపక్ష శ్రేణులు ప్రదర్శన చేపట్టాయి. కర్ణాటకలో రైతు సంఘాలు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి.. అగ్రి చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. వైనూర్‌లో బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. తమిళనాడు లోనూ భారత్ బంద్ కొనసాగింది. అక్కడ డిఎంకె తదితర పార్టీలు మద్దతు పలికి బంద్‌లో పాల్గొన్నాయి. అసోంలోనూ రైతులకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించారు. తెలంగాణలో.. భారత్ బంద్‌కు టీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా టీఆర్ఎస్ శ్రేణులు బంద్‌లో పాల్గొన్నారు. ప్రధాన కూడళ్లలో రాస్తారోకోలు నిర్వహించి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రైతులు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో ర్యాలీలు నిర్వహించి.. కొత్త సాగు చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు.

చరిత్రలో నేటినిజం



కం॥ మిత్రులతో మిత్రుడగుచు
శత్రుల కేము మిత్రుడగుచు చతురుగగలడో
చిత్రమ్ములలో నబద్ధ
"శత్రుఘ్నుప్రసాదు సిన్హా" శతసుతులగానున్!!

(డిసెంబర్ 9 శత్రుఘ్నసిన్హా జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

రైతు సమస్యలపై రాజకీయ చిత్తశుద్ధి రావాలి !

నేటినిజం
బుధవారం 9-12-2020

దేశరాజధాని ఢిల్లీని చుట్టుముట్టిన భారతీయ రైతులు ఇప్పుడు భారత్ బంద్‌తో దేశాన్నే స్తంభింప చేసేందుకు సిద్ధం కావడంతో ..విపక్ష పార్టీలు అన్నీ కూడా రైతులకు మద్దతుగా బంద్‌లో పాల్గొనడంతో భారత్ బంద్ తీవ్ర ప్రభావం చూపింది. దేశంలో జనజీవనం స్తంభించింది. చాలాకాలం తరవాత భారత్ బంద్ జరగడంతో ప్రజలు కూడా సహకరించారు. అయితే బంద్ వల్ల రైతులకు మద్దతు కన్నా ఆయా రాష్ట్రాల్లో తమ బలిమి చాటుకోవాలన్న తపన ప్రాంతీయ పార్టీల్లో విశేషంగా కనిపించింది. వీరికి కాంగ్రెస్ కూడా తోడయ్యింది. ఎక్కడా పునాది లేకుండా పోతున్న తరుణంలో కాంగ్రెస్ దొరికిన ప్రతి అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. అందుకే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు బంద్‌కు పిలుపునిచ్చి ముందుండి నడిపిస్తున్నాయి. తెలంగాణలో అధికార టిఆర్ఎస్ తొలిసారిగా బంద్‌కు పిలుపునిచ్చింది. రాజస్థాన్,పంజాబ్, బెంగాల్,కేరళ తదితర రాష్ట్రాల్లో సహజంగానే అధికారిక బంద్ కొనసాగడం గమనించవచ్చు. ఇకపోతే కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయ చట్టాలు మేలుచేసేవిగా లేకుంటే ఖచ్చితం గా వీటిపై చర్చించాలి. వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ చర్చించాలి. భారత్ బంద్ ద్వారా ప్రత్యామ్నాయ చట్టాలకు చర్చలు చేయాలి. ఏం చేస్తే అన్నదాతకు మేలు జరగగలదో..ప్రజలకు నిత్యావసర ధరలు సక్రమంగా అందగలవో చర్చించాలి. ఇక్కడ రైతులకు,ప్రజలకు అవినాభావ సంబధం ఉంది. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే ప్రజలకు సరసమైన దరలకు సరుకులు దొరకడం లేదు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి ధరల నిర్ణయం జరగాలి. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు రౌండ్ టేబుల్ సమా వేశాలు పెట్టి ప్రత్యామ్నాయ విధానాలు తెరపై కి తీసుకుని రావాలి. ముందుగా తెలంగా ణను తీసుకుంటే ఇక్కడ ఉచిత విద్యుత్‌తో పాటు, నీటి తీరువాను కూడా ఉచితం చేశారు. రైతులు నీటితీరువా చెల్లించడం లేదు. అలాగే ఎకరానికి ఏటా పదివేలు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయంగా చెల్లిస్తున్నారు. రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. రైతుబీమా ద్వారా ఇన్సూరెన్స్ అమలు చేస్తున్నారు. గ్రామస్థాయిలోనే కొనుగోళ్లు చేపట్టారు. ఓ రకంగా ఇవన్నీ కూడా రైతులను ఆదుకునేందుకు తీసుకున్న విప్లవాత్మక చర్యలుగా చూడాలి. ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి బ్రహ్మాండంగా చేసామని చెప్పుకుంటోంది. అయినా తెలంగాణలో రైతుల ఆందోళనలు ఆగడం లేదు. ప్రత్యేక తెలంగాణలో మక్కరైతులు ఇటీవల ఆందోళన చేస్తే కేసులు పెట్టారు. సన్నాలకు మద్దతు ధరలకోసం ఆందోళనకు దిగిన వారిపైనా కేసులు పెట్టారు. రైతుల ఆందోళనలను ఉక్కుపాదంతో అణచి వేసారు. ఇవన్నీ కూడా ఎందుకు చేశారన్నది ప్రభుత్వం వివరణ ఇచ్చుకోవాలి. రైతుసంఓ ఏమమే లక్ష్యమయితే వీరిని ఎందుకు అడ్డుకున్నారో చెప్పాలి. రైతుబంధు సమితులు ఏర్పాటు చేసినా ఎక్కడా ఈ సంఘం నేతలు రైతులను కలసి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. వారితో ఎక్కడా చర్చ చేసిన దాఖలాలు లేవు. ఇకపోతే నియంత్రిత సాగులో భాగంగా సన్నాలు పండించిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమకు మద్దతు ధరుల చెల్లించాలని, పంటలను కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అంటే రైతులు ఇంకా ఏదో కోరుకుంటున్నారని అర్థం చేసుకోవాలి. కాబట్టి తెలంగాణ తో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రభు త్వాలు రైతాంగ సమస్యలపై చిత్తశుద్ధితో మాట్లాడాలి. రైతులకు మేలు చేసే లా ప్రత్యామ్నాయ విధానలను తీసు కుని రావాలి. రైతులు ధీమగా వ్యవ సాయం చేసుకునే అవకాశాలు కల్పిం చాలి. రైతులు పండించిన ఉత్పత్తులను నేరుగా ప్రజలకు అందేలా చేయాలి. కానీ అవన్నీ పక్కన పెట్టి తమ పబ్బం గడుపుకోవడానికి పంజాబ్, హర్యానాల్లో జరుగుతున్న ఆందోళనలను పెద్దవిగా చేసి వారికి మద్దతుగా అంటూ బంద్‌లో పాల్గొనడం సిగ్గుచేటు. దేశరాజధాని ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఈ రాష్ట్రాలకు చెందిన కొందరు రైతులు ఢిల్లీని చుట్టుముట్టారు. ఇది చాలా తేలికైన విషయం. కానీ ఇతర రాష్ట్రాల వారు దేశరాజధానికి రాలేరు. అయితే ఆ రాష్ట్రాల రైతుల డిమాండ్ల సరైనవే అయితే జాతీయ స్థాయిలో చర్చచేసి, బిజెపి ప్రభుత్వ మెడలు వంచా ల్సిందే. వారు కార్పోరేట్లకు కొమ్ముకాస్తుంటే నిలదీ యాల్సిందే. వందలాది రైతు సంఘాల ఆధ్వర్యంలో సమైక్యంగా జరుగుతున్న సమరశీల పోరాటానికి 15 రాజకీయ పార్టీలు పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతు ప్రకటించడం మంచిదే అయినా ప్రత్యమ్నాయం చూపితేనే ఆయా పార్టీల విశ్వసనీయత బయట పడగలదు. ఆయా రాష్ట్రాలు రైతల కోసం ఏమేం చేస్తున్నాయో ముందుగా ప్రకటించాలి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ వేదిక కోసం ప్రయత్నిస్తానని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బంద్‌కు మద్దతు నివ్వడం రాజకీయ ప్రాధాన్యత గల అంశంగానే చూడాలి. బెంగాల్లో రైతులకు ఏ మేరకు మేలు జరుగుతుందో మమతా బెనర్జీ ముందుగా ప్రకటించాలి. అలాగే కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో సిఎం గెహ్లోట్ ఏ మేరకు రైతులను ఆదుకుంటున్నారో చెప్పాలి. కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాల సిఎంలు కూడా ఇదేవిధంగా బహిరంగంగా ప్రకటనుల చేయాలి. దశాబద్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఎందుకు రైతులను ఆదుకోలేక పోయిందో చెప్పాలి. రాజకీయం కోసం చేసే ఉద్యమాలు ఎల్లకాలం నిలవవని గుర్తించాలి. నిజంగా వీరందరితో పోలిస్తే తెలంగాణలోనే అంతోఇంతో రైతులకు మేలు జరుగుతోంది. వారికే సాయం అందుతోంది. కాకపోతే రైతుబందు పేరుతో రాబందులు ప్రజాధ నాన్ని మెక్కుతున్నారు. వారిని ఏరిపారేయాలి. నిజమైన రైతుకే ఆర్థిక సాయం అందాలి. కార్పోరేట్ అన్న పదం వల్లిస్తున్న వామపక్షాలు సెల్‌ఫోన్ మొదలు, టీవీలు తదితర ఉపకరణాలు అన్నీ కార్పోరేట్ కంపెనీలే అని గుర్తించాలి. ఇవన్నీ పక్కన పెట్టి చిత్తశుద్ధితో పనిచేయాలను కుంటున్న వారు రైతులను సమాయత్తం చేసి వారికి ఏం చేయబోతున్నరో చెప్పాలి. అంతేగాని రైతులను పోగేసి రచ్చ చేయడం కేవలం రాజకీయం తప్ప మరోటి కాదు. ఇప్పటికే గిట్టుబాటు కాక ఏటా కోటి మందికి పైగానే రైతులు వ్యవసాయం మానేస్తున్నారు. రోజుకు పదిమంది రైతు ఆత్మహ త్యలు చోటు చేసుకుంటున్నారు. పల్లె వదలి వలస బాట పట్టి పట్టణాలు నగరాలకు వచ్చి అనామ కమంగా అసహాయంగా బతుకుతున్నారు. అప్పు పాలవుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారికి ఇతోధిక సహాయం అం దించడంలేదు. రుణరద్దు పరపతి వంటివి కల్పించాల్సింది పోయి వారిని అంతా నిర్లక్ష్యం చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలకు అందరూ కొమ్ము కాస్తూనే ఉన్నారు. వారికే పెద్దపీట వేస్తున్నారు. వారి అడుగులకు మ డుగులు ఒత్తుతున్నారు. ఇందుకు ఎవరూ అతీతులుగా లేదు. రాయి తీలు ఇచ్చి వ్యవసాయ రంగాన్ని నిజంగా ఎందుకు ఆదుకోవడంలేదో చెప్పాలి. కరోనా వేళ రైతులు వలస వెళ్లి తిరిగొచ్చిన వ్యవసాయ కార్మికుల బాధకు అంతులేదు. వారిని ఆదుకున్నారా అంటే అదీ లేదు. రాష్ట్రాల్లో తుఫాన్ల కారణంగా రైతులు నష్టపోతే ఆయా ప్రభుత్వాలు ఏ మేరకు ఆదుకున్నారో చెప్పాలి. ఈ సందర్భాన్ని అవకాశంగా తీసుకుని రైతులకు మేలు జరిగే చర్చ చేస్తే మంచిదే. అలాకాకుండా కేవలం రాజకీయ ఎజెండాతో ముందుకు సాగితే ఆ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం.

పిసిసి చీఫ్ పదవి కరీంనగర్‌కు దక్కేనా?

జిల్లా వాసులు పొన్నం లేదా శ్రీధర్ బాబుకు దక్కాలి

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల్లో ఆశలు

కరీంనగర్,డిసెబర్8(ఆర్ఎన్ఎ): ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ ఏర్పడ్డ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి రేసులో ఉన్న మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆ పదవి దక్కుతుందా లేక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కుతుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్‌కు చెందిన బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌కు గట్టి పోటీ ఇవ్వాలంటే, టిఆర్ఎస్‌ను గట్టిగా ఢీకొనాలంటే శ్రీదర్ బాబు లేదా పొన్నం ప్రభాకర్లకు పిసిసి అధ్యక్ష పదవిని కట్టబెట్టాలని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారు. ఆ స్థానానికి మల్కాజిగిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పోటీలో ఉన్నట్లు సమాచారం. హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి చెందిన అనంతరమే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం కొత్త అధ్యక్షుడిని నియమించాలని భావించింది. దీంతో నేతల మధ్య పోటీ తీవ్రమయ్యింది. దీంతో వెనక్కి తగ్గిన ఏఐసీసీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే కొనసాగిస్తూ వచ్చింది. అదే సమయంలో అధ్యక్ష పదవికి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన శ్రీధర్‌బాబుకు టీపీసీసీ పీఠం కట్టబెడుతారనే ఊహాగానాలు వినిపించాయి. కానీ ఎవరిని నియమించలేదు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఎన్నికల్లో పరాజయం పాలవుతున్న కాంగ్రెస్ ఈ సమయంలో కూడా టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిని నియమించకపోతే పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితులు ఉత్పన్నం అవుతాయని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 9లోపు నూతన అధ్యక్షుడిని నియమించే అవకాశాలున్నాయి. పార్టీకి విధేయుడిగా ఉన్న శ్రీధర్‌బాబుకే టీపీసీసీ పదవి కట్టబెట్టనున్నారని తెలిసింది. టీపీసీసీ అధ్యక్ష పదవి రేవంత్‌రెడ్డికి ఇస్తే శ్రీధర్‌బాబుకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఇచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కరీంనగర్ నుంచి బండి సంజయ్ ఉన్నందున కరీంనగర్ నేతలకు పిసిసి పదవి ఇస్తే బాగుంటుందన్న భావన వస్తోంది.

ముందు తెలంగాణ రైతులను ఆదుకోండి

–కెసిఆర్‌పై ఎంపీ సోయం బాపురావు ధ్వజం

ఆదిలాబాద్,డిసెంబరు 8(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రైతులను ఆదుకోవడంలో విఫలమైన సిఎం కెసిఆర్ భారత్ బంద్‌కు పిలుపునిచ్చి, అందులో పాల్గొనడం సిగ్గుచేటని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న మక్క, సన్నరైతులకు ఎందుకు గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనడం లేదో ముందు చెప్పాలన్నారు. రైతులు ఆందోళనలు చేస్తే కేసులు పెట్టిన కెసిఆర్ రైతుల సంక్షేమం గురించి మాట్లాడడం

దుర్మార్గమని దుయ్యబట్టారు. తెలంగాణ రైతులకు సాయం చేయడంలో విఫలమైన కెసిఆర్‌కు బిజెపిని విమర్శించే హక్కు లేదన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చి న తీర్పుతోనైనా టీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలని అన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ముఖ్యమంత్రి తన తీరును మార్చుకోవాలన్నారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ జెండా ఎగుర వేస్తామన్నారు. గ్రేటర్ ఫలితాల అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. హైదరాబాద్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ఘన విజయం సాధించిందన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు ఈ ఫలితాలు చెంపదెబ్బలాంటివని పేర్కొన్నారు. అందుకేఉ రైతుబందుకు కెసిఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు. తెలంగాణలో రైతులు టిఆర్ఎస్‌ను నమ్మడం లేదన్నారు. మజ్లిస్ పార్టీతో టీఆర్ఎస్ పార్టీ పొత్తుపెట్టుకొని ప్రజలను మోసగించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు సక్రమంగా లేకపోవడంతోనే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారానికి ప్రజలు తగిన గుణపాఠమే చెప్పారని దుబ్బాక ఉప ఎన్నికల పలితాలతో టీఆర్ఎస్ పార్టీ పతనం ప్రారంభమైందన్నారు.

నేడు బంద్‌కు ఆదివాసీల పిలుపు

ఆదిలాబాద్, డిసెంబరు 8(ఆర్ఎన్ఎ): తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఆదివాసీలు ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తబంద్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే రహదారులను అష్ట దిగ్బంధం చేసేందుకు సిద్ధమవుతున్నారు. చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, అటవీ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, జీవో నెం.3ని పునరుద్ధరిస్తూ, నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తిస్తూ ఎల్ఆర్ఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆదివాసీ సంఘాల నేతలు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే బంద్‌కు పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. ఆదివాసీ తొమ్మిది తెగల మద్దతుతో బంద్‌ను విజయవంతం చేస్తామని తుడందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షు డు గోడం గణేశ్, పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈనెల 9న రాష్ట్ర బంద్‌కు అన్ని రకాల వర్తక, వ్యాపార, వాణిజ్య రంగాల వారు సహకరించాలని తుడందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. శనివారం పార్టీ(బి)లో ఏర్పాటు చేసిన ఆదివాసీ నాయకుల సమావేశంలో ఆయనతో పలువురు నాయకులు మాట్లాడారు.రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేలో కలసి మంత్రి బైక్ ర్యాలీ

మహబూబాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర గిరిజన, స్త్రీ– శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఇవాళ భారత్‌బంద్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో కలిసి ఆమె ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు దేశ వ్యాప్తంగా భారత్‌బంద్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ బంద్‌ను సంపూర్ణంగా నిర్వహించాలని సీఎం కేజీఆర్ కూడా ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌లు సంయుక్తంగా ఇవాళ మహబూబాబాద్ జిల్లా నర్సంపేట రోడ్డు చౌరస్తాలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ బైక్‌ను రైడ్ చేస్తుండగా.. మంత్రి సత్యవతి ఆ బైక్‌పై వెళ్లారు. రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం తక్షణమే రద్దు చేయాలని మంత్రి కోరారు. ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఫరీద్ ఇతర నాయకులు, పార్టీ శ్రేణులు రైతులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, వాణిజ్య, వ్యాపార వర్గాలవారు పాల్గొన్నారు.

అవినీతి అంతానికి పౌర సైనికులమవుదాం..!

(09 డిసెంబర్ 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మానవాళిని పట్టి పీడిస్తున్న తీవ్రమైన సమస్యల్లో అవినీతి ప్రధానమైనదే కాదు సర్వవ్యాప్తమైంది కాడా అని గుర్తించబడింది. అవినీతి రహిత దేశం లేదు. నైతికత సలిగిపోయి, పారదర్శకత పలుచబడి, అక్రమార్కులు పేట్రేగిపోయి సామాన్య ప్రజలు లంచగొండితనం అనే రక్కసి కోరల్లో చిక్కి సతమతం అవుతున్నారు. ప్రపంచ దేశాల్లో ఆకలి కన్న అత్యంత భయంకరమైన సమస్యగా అవినీతి అవతరించింది. లంచగొండితనం అనేది ఒక సంక్లిష్ట సామాజిక, రాజకీయ, ఆర్థిక, ప్రభుత్వరంగ సమస్యగా విశ్వవ్యాప్తం అయ్యింది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడం, అవగాహనలు కల్పించడం, మూలాలను అన్వేషించడం, అవినీతి పరులను శిక్షించడం, కఠిన చట్టాలు రూపొందించి అమలు పరచడం లాంటి పలు అంశాలను చర్చించే సదుద్దేశ్యంతో ప్రతియేట 09 డిసెంబర్ రోజున 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం' పాటించడం జరుగుతోంది. 2003లో ఐరాస జనరల్ అసెంబ్లీ తీసుకున్న తీర్మానం (58/4) ప్రకారం 09 డిసెంబరు 2005 నుంచి అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం జరుపుకుంటున్నాం. ఐరాస గణాంకాల ప్రకారం ప్రతియేట 1 ట్రిలియన్ డాలర్లు అవినీతి పరుల జేబులకు చేరుతున్నాయని మరియు 2.6 ట్రిలియన్ డాలర్లు అక్రమ మార్గంలో దోపిడి చేయబడుతున్నాయని తేలింది. ప్రపంచ జిడిపీలో 5 శాతం మేరకు లంచాల రూపంలో అక్రమ సంపాదన చేతులు మారుతున్నది. కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వ అధికారిక అభివృద్ధికి కేటాయించిన నిధుల కన్న 10 రెట్లు ఎక్కువగా అవినీతిరూపంలో ధనం ఇమిడి ఉందని తెలుస్తున్నది. అవినీతి నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద మరియు పౌర సమాజం చేతులు కలుపాల్సిన సమయం ఆసన్నమైందని గమనించాలి.

మానవాళి అభివృద్ధికి ప్రధాన అవరోధంగా నిలిచిన అవినీతి జాడ్యాన్ని అదుపు చేసేందుకు అందరం ముక్త కంఠంతో వ్యతిరేకించాలి. అవినీతి రాజ్యమేలితే పేదరికం, అశాంతి, హింస, ఆర్థిక మందగమనం, నేరప్రవృత్తి, ఆకలి చావులు, ఆర్థిక అసమానతలు పెరుగుతాయని చరిత్ర వివరిస్తున్నది. నేర చరిత మరియు అవినీతి పరులే రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్నారు. ప్రపంచ దేశాల్లో అవినీతిని 'కరప్షన్ పరసెప్షన్ ఇండెక్స్ (సిపిఐ)' రూపంలో పోల్చుతారు. సిపిఐ కొవమానంలో ,100' ఉన్నట్లయితే అవినీతి రహిత దేశంగా మరియు '0' ఉన్నట్లైతే అత్యంత అవినీతి దేశమని నిర్వచించాలి. అవినీతి పెరిగితే సిపిఐ విలువ తగ్గుతుందని గమనించాలి. డెన్మార్క్(సిపిఐ 87), ఫిన్‌లాండ్(86), న్యూజిలాండ్(87), స్వీడన్(85), సిగపూర్(85) మరియు స్విట్జర్‌లాండ్(85) అత్యంత నీతివంతమైన దేశాలు నిలిచాయి. అత్యంత అవినీతివంతమైన దేశాల్లో సొమాలియా(09), యెమన్(15), సూడాన్(16) సిరియా(13), నార్త్ కొరియా(17), లిబియా(18), వెనెజులా(16) మరియు అఫ్ఘానిస్థాన్(16) లాంటి వెనుకబడిన దేశాల్లో అవినీతి అత్యధికంగా ఉన్నది. ఇండియా సిపిఐ సూచిక 41 ఉండడం మరియు 180 దేశాల సిపిఐ జాబితాలో 80వ స్థానంలో ఉండడం గమనించాలి. లంచగొండితనంతో ప్రజాస్వామ్యం పరిహసించ బడడం, ప్రభుత్వాలు అస్థిరత్వం పాలు కావడం, దేశ ఆర్థిక ప్రగతి తిరోగమన దిశకు మారడం జరుగుతాయి. చట్టాల ఉల్లంఘన, చట్టాలల్లో లొసుగులు గమనించి రంధ్రాన్వేషణ చేయడం, పౌరుడి అవసరాన్ని అలుసుగా తీసుకోవడం, అధికార దుర్వినియోగం, అశ్రిత పక్షపాతం, బంధు ప్రీతి, లంచం తీసుకోవడం, భావకాలుష్యం లాంటి అనేక దురాచారాలు అవినీతి కిందికి వస్తాయి. నేడు అవినీతితో ఎన్నికల ప్రక్రియ నవ్వులపాలు కావడం నిత్యకృత్యం అవుతున్నది. అవినీతిపరులైన రాజకీయ నాయకులు మరియు ఉన్నత అధికారుల ఆదేశాలే అలిఖిత చట్టాలు మరియు నియమాలవుతున్నాయి. అధికారం అవినీతికి మార్గమవుతున్నది. అధికార దుర్వినియోగంతో వ్యక్తి స్వేచ్ఛ, ఆరోగ్యం, జీవితం, హక్కులకు భంగం, సామాజిక న్యాయం, ప్రభుత్వ పాలన మరియు భవిష్యత్తులకు విఘాతం కలుగుతుంది.

భారతదేశం అవినీతి మరియు లంచగొండితనంలో ప్రపంచ దేశాల్లో అగ్రభాగాన నిలుస్తోంది. ఇండియా ప్రగతి నిరోధకంగా అవినీతి చెదలు నిలుస్తున్నది. మన దేశంలో అనాదిగా నెలకొన్న అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, కాలుష్యం, బాహ్య ఒత్తిడులు మరియు అభివృద్ధికి దూరంగా ఉండడం లాంటి కారణాలతో అవినీతి రాజ్యమేలుతూ, ప్రగతి నిరోధకంగా సమస్యల తీవ్రతను రెట్టింపు చేస్తున్నది. ప్రభుత్వ రెవెన్యూ, పోలీస్ లాంటి శాఖల్లో అవినీతి అందనంత ఎత్తుకు చేరింది. అనేక ప్రభుత్వ పథకాలు పేదలకు దూరమవుతున్నాయి. అవినీతి ఉద్యోగులను పట్టుకోవడం, అవినీతి ఎర చూపి శిక్షల నుంచి బయట పడడం సర్వసాధారణం అయ్యింది. అవినీతి వ్యతిరేక చట్టాలు ఎన్ని ఉన్న వ్యక్తి నైతికత వైపు నడవక పోతే, అవినీతిని నిరోధించడం కష్టం అవుతుంది. భారత్‌లో అధికారులు, రాజకీయ నాయకులు మరియు నేరస్థుల మధ్య విష వలయంగా అవినీతి సామ్రాజ్యం పోషించబడుతున్నది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారి నుంచి బంట్రోతు వరకు అవినీతి పరుగానే ముద్రపడ్డారు. చేతులు తడపందే ఫైల్ కదలదు, పని జరుగదు. తూకంలో మోసాలు, నకిలీ సామాన్లు, అడల్టరెషన్, పన్ను ఎగవేతలు కూడా అవినీతి రూపాలుగా సమాజ ఆరోగ్యానికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. నేర చరిత్రే రాజకీయాలకు అర్హత అయిన దేశంలో, చట్టం చేసే వారే నేరారోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో జాతీయ ప్రగతి అందని త్రాక్షే అవుతున్నదని పౌరులు తల వంచుకుంటున్నారు. నైతిక విలువలు లోపించడం, బాధ్యతలు సక్రమంగా నిర్వహించక పోవడం, కఠిన చట్టాలు అమలు కాకపోవడం, జీతాలు తక్కువగా మరియు కోరికలు ఎక్కువగా ఉండడం, విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడడం లాంటి ప్రతికూల అంశాలు భారత్‌ను అవినీతి ఊబిలోకి నెడుతున్నాయి. 'అవినీతికి వ్యతిరేకంగా ఏకమవుదాం' అనే నినాదంతో అవినీతి వ్యతిరేక ప్రచారాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంలో నైతికత, పారదర్శకత, దేశభక్తి, చట్టాల పట్ల గౌరవం, కౌంటబులుటీ, అంకితభావం పెరగాలి. అవినీతి, లంచగొండితనం లేని భారతాన్ని నిర్మించడంలో మనందరం పౌర సైనికులం అవుదాం. నీతివంతమైన జాతికి వారసులం అవుదాం.

తెలంగాణ వ్యవసాయ విధానాలే దేశానికి కావాలి

అన్ని విధాలా రైతులకు అండగా ఉంటున్న కెసిఆర్
వ్యవసాయ చట్టాలు రైతులకు ఉరి కాబోతున్నాయి
అందుకే భారత్ బంద్‌కు మద్దుతుగా నిలిచాం: నిరంజన్

మహబూబ్‌నగర్,డిసెంబర్8 (ఆర్ఎన్ఎ): విత్తన ఉత్పత్తి చేసే రైతులు అధిక లాభాలను ఆర్జించేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం నిరంజన్ రెడ్డిఅన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి పెద్ద ఎత్తున మద్దు కల్పిస్తున్నామని, కానీ కేంద్రం విష చట్టాలతో రైతులకు ఉరి బిగిస్తోందని అన్నారు. కేంద్రం తీరుపై సిఎం కెసిఆర్ పోరాడుతున్నారని అన్నారు. అందుకే బంద్‌కు మద్దతు పలికామని అన్నారు. ఇకపోతే దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఘనత సిఎం కెసిఆర్‌దని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న విధానాలు దేశవ్యాప్తంగా అమలు చేస్తే సమస్యలు రావన్నారు. రైతులు సంతోషంగా బతుకుతారని అన్నారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం కెసిఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చుకోవడానికి సీఎం కేసీఆర్ పలు చర్యలు తీసుకొంటున్నారని, అందుచేత రైతులు లాభాలు ఆర్జించేందుకు ప్రోత్సాహం అందించాలని విత్తన కంపెనీలకు సూచించారు. విత్తన ఉత్పత్తి విషయంలో తెలంగాణ జిల్లాలు అగ్రస్థానంలో నిలబడి ఎక్కువ మంది రైతులు విత్తన ఉత్పత్తిలో ఉంటారని అన్నారు. కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం విత్తన ఉత్పత్తికి రైతులతో ఒప్పందాలకు కంపెనీల ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్నకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. మరికొంత విస్తీర్ణంలోనూ పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలిపారు.

గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించకపోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ పాపం వారిదేనన్నారు. దేశంలో తొలిసారిగా పాలీహౌస్ సాగును హర్యానాలో ప్రారంభిం చారని, ఏడాదికి 150 ఎకరాల్లో సాగు చేస్తే.. తెలంగాణలో రెండేండ్లలో వేయిఎకరాల్లో సాగైందని మంత్రి తెలిపారు. మెదక్,నిజామాబాద్ జిల్లాల్లో పాలీహౌస్ సాగుచేస్తూ బాగా సంపాదిస్తున్నారని చెప్పారు. మరోవైపు వ్యవసాయ విద్యుత్ ఉచిత కనెక్షన్లు పెండింగ్ లేకుండా చూస్తామని ప్రకటించిన ప్రభుత్వం అందుకు కార్యాచరణ చేప

పల్లె ప్రకృతి వనాలు ఈ నెల 10 లోగా పూర్తి చేయాలి

– సంబంధిత అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంగారెడ్డి డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి) అదనపు కలెక్టర్ లు వ్యవసాయ, అటవీ,పంచాయతీ శాఖల అధికారులు,జెడ్పీ సీఈఓ, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డి పి ఓ, డి ఆర్ డి ఓ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, డివిజనల్ పంచాయతీ అధికారులు ,ఎంపీడీఓ లు ,ఏ పీ ఎం లు ,ఏ పీ ఓలు, పంచాయతీసెక్రటరీ లతో సోమవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

పల్లె ప్రకృతి వనాలు ,కళ్లాలు, నర్సరీలు, లేబర్ టర్న్ వుట్, తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి అధికారులు జిల్లాకు తనిఖీకి వస్తున్నారని, సంబంధిత రిజిస్టర్ లన్ని అప్ డేట్ గా నిర్వహించాలని సూచించారు. వాటిపై పంచాయతీ సెక్రటరీలకు,మెట్స్ కు అవగాహన ఉండాలని అన్నారు. జాబ్ కార్డులను అప్డేట్ చేయాలని సూచించారు.పల్లె ప్రకృతి వనా లు అన్ని గ్రౌండింగ్ కావాలన్నారు. అనువుగా లేని స్థలాలకు ప్రత్యామ్నాయస్థలాలను కేటాయించాలని ,ఇంకా 18 ఆవాసాలకు స్థలాలను గుర్తించి స్వాధీనం చేయాల్సి ఉందని, వెంటనే స్వాధీనం చేయాలని ఆయా తహసీల్దార్లు ,ఆర్డీవోలకు సూచించారు.పల్లె ప్రకృతి వనాలు నిర్జీత గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఎంపీ ఓ లదే అన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ నెల 10 లోగా వంద శాతం నర్సరీలు పూర్తి చేయాలని సూచించారు. బ్యాగ్స్ ఫిల్లింగ్ సాయిల్ కలెక్షన్, సీడ్ డి బ్లింగ్.పూర్తి కావాలన్నారు. నర్సరీల పై ఎంపీడీవోలు ,ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు దృష్టి పెట్టాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం చూపినా కింది స్థాయి అధికారుల నుండి పై స్థాయి అధికారుల వరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ప్రతి నర్సరీలో ప్రైమరీ బెడ్స్ వుండా లని తెలిపారు. డ్రయింగ్ ప్లాట్ ఫామ్ ల నిర్మాణం వేగవంతం కావాలన్నారు. కళ్లాలు ప్రతి గ్రామంలో పది చొప్పున చేయాలని సూచించినా క్షేత్రస్థాయిలో నిరాశాజనకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.లేబర్ టర్న్ ఔట్ తక్కువగా ఉందని , ప్రతి గ్రామ పంచాయతీలో 50 మంది లేబర్ విధిగా పనిచేయాలన్నారు. ముందస్తుగా పనులు గుర్తించి పెట్టుకోవాలని తెలిపారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు పర్యవేక్షించి పురోగతిని సమీక్షించాలన్నారు. పంచాయతీ సెక్రటరీల పనితీరు బాగు లేనట్లయితే నివేదికను అందించాలన్నారు. సీగ్రిగేషన్ షెడ్లో వర్మి కంపోస్టు తయారు కావాలన్నారు. వైకుంఠ దామాలు , డంప్ యార్డుల చుట్టూ మూడు వరుసల మొక్కలు నాటాలని తెలిపారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, డి ఆర్ డి ఓ శ్రీవాసులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా,రాస్తారోకో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లును ఉపసంహరించుకోవాలి :ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి):భారత్ బంద్ భాగంగా మంగళవారం వేములవాడ పట్టణంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక బిల్లుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు .ధర్నా ,రాస్తారోకో నిర్వహించారు .అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూకర్షకుల కష్టాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే ఊరుకో అన్నదాతలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాంఅని అన్నారు .అహోరాత్రులు శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవసాయ బిల్లులు ప్రవేశపెట్టి కర్షకుల కష్టాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతుకు వ్యతిరేకంగా ప్రవేశ పెట్టిన రైతు బిల్లును ,చట్టాలను రద్దు చేయాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల అర్బన్ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్ పిల్లి కనకయ్య నాయకులు రంగు వెంకటేష్ గౌడ్ చంద్రగిరి శ్రీనివాస్ సంఘ స్వామి యాదవ్ మోడిగే చంద్రశేఖర్ కనికరపు రాకేష్ వస్తాది కృష్ణ నాగుల రాము గౌడ్ చిలువేరు శ్రీనివాస్ హైమద్ పాషా కొలకని రాజు వనపర్తి శంకర్ తంగెళ్ల గణేష్ ప్రభాకర్ రెడ్డిలింగంపల్లి కిరణ్ కరుణాకర్ నరేష్ రాజు తదితరులు ఉన్నారు

వాలీ బాల్ క్రీడాకారులకు శుభవార్త

ఏదో ఒక క్రీడలో రాణించాలి
క్రీడలకు సహకరిస్తున్న
తోట కుమార్ కు కృతజ్ఞతలు

– జిల్లా వాలీబాల్ ఉపాధ్యక్షుడు ,టౌన్ ఎస్సై రామచంద్రం గౌడ్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణ మరియు పరిసర గ్రామాల వాలీబాల్ క్రీడాకారుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ,ా్ఎ రామచంద్రం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ ఆసక్తి వున్న వారు వచ్చి ఆడుకోవచ్చు అని, క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం పెంపొందుతుందని ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని గురించి నిరంతరం శ్రమించాలని అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. గత కొద్ది సంవత్సరాలనుండి వేములవాడ పట్టణ పరిధిలో వాలీబాల్ క్రీడ మరుగున పడి ఉందని, మంచి నైపుణ్యం కలిగిన అభ్యర్థులను వెలికి తీయటానికి ఈ కోర్ట్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని అభ్యర్థుల కు సూచించారు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నుండి తమ సహకారం ఉంటుంది అని అభ్యర్థులు పట్టుదల తో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవచ్చు అని, గతం లో తమ అభ్యర్థులు జాతీయ స్థాయిలో రాణించారు అని తెలిపారు. ఉదయం సాయంత్రం ఇట్టి వాలీబాల్ కోర్ట్ ను సద్వినియోగం చేసుకొని ఆట లో మంచి నైపుణ్యం పొందాలని తెలిపారు. భవిష్యత్ లో టోర్నమెంట్ లు జరిపి మంచి నైపుణ్యం వున్న అభ్యర్థులుగా తయారు చేస్తాం అని తెలిపారు. ఇట్టి వాలీబాల్ కోర్ట్ కు సహకారం అందిస్తున్న టి ఆర్ కే ట్రస్ట్ తోట రామ్ కుమార్ గారికి ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమం లో టి ఆర్ కే ట్రస్ట్ సభ్యులు, యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్, పి ఈ టీ అర్జున్ మరియు అభ్యర్థులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్తికి బ్రాండ్ ఇమేజ్

నాణ్యమైన పత్తిలో మనదే బెస్ట్
బ్రాండ్ ఇమేజ్ కోసం కృషి చేయాలన్న సిఎం కెసిఆర్
8లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ఆదేశాలు

హైదరాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): తెలంగాణ పత్తికి బ్రాండ్ ఇమేజ్ తీసుకుని రావాల్సి ఉందని సిఎం కెసిఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పండే పత్తి దేశంలో కెల్లా అత్యంత నాణ్యమైనదిగా గుర్తింపు పొందిందని, ప్రపంచంలోకెల్లా అత్యంత నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో తెలంగాణ ఒకటని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో పండే పత్తి స్టేపుల్ పొడవు దేశలో కెల్లా అత్యంత పొడవుగా వస్తుందని , గట్టితనం కూడా ఎక్కువని సీఎం అన్నారు. అత్యంత నాణ్యతతో కూడిన తెలంగాణ పత్తికి అంతర్జాతీయంగా డిమాండ్ కల్పించేందుకు ఓ బ్రాండ్ ఇమేజ్ తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ పత్తికున్న విశిష్ట లక్షణాలను గుర్తించి, వాటిని ప్రచారం చేయడానికి అవసరమైన వ్యూహం రూపొందించాలని కోరారు. దీని కోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిపుణులతో ఓ సదస్సు నిర్వహించాలని సీఎం చెప్పారు. తెలంగాణ పత్తికి అంతర్జాతీయంగా మరింత డిమాండ్ రావడానికి అనుగుణంగా పత్తి ఏరిన తర్వాత శుద్ధి చేయడం, ప్యాక్‌చేయడం లాంటి పనులను జాగ్రత్తగా నిర్వహించే విషయంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు. దేశంలో ఎక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగు చేస్తున్న రెండో రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో పత్తిసాగు అవుతున్నది. పత్తికి దేశఖూయంగా , అంతర్జాతీయంగా మంచి మార్కెట్ వుంది. తెలంగాణ పత్తి పింజ పొడవు ఎక్కువ కాబట్టి మరింత డిమాండ్ ఉంది. పత్తిలో ఏమాత్రం చెత్తాచెదారం, మట్టి పెళ్లలు, దుమ్ముచేరకుండా చూడాలని చెప్పారు. ' ఇరిగేటెడ్ వాటర్ (సాగునీరు) ద్వారా సాగుచేసే భూముల్లో పంట మరింత బాగా వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు ఎక్కువ కట్టుకున్నందున సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కాబట్టి కాల్వల కింద పత్తిని సాగుచేస్తే మరింత లాభసాటిగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి అన్నారు. పత్తికి మించి మార్కెట్ రావడానికి ప్రభుత్వం కూడా అవసరమైన చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో 8లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు నిర్ణయించారు. రూ. 4,800 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలో చేపట్టే ఆయిల్‌పామ్ పంట విస్తరణ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఆమోదించారు. రైతులకు 50శాతం సబ్సిడీ ఇచ్చి ఆయిల్‌పామ్ సాగు చేయించనున్నట్టు సీఎం వెల్లడించారు. నిత్యం సాగునీటి వసతి కలిగిన ప్రాంతాల్లోనే ఆయిల్‌పామ్ సాగు చేయడం సాధ్యమవుతుందని , తెలంగాణ రాష్ట్రంలో పెరిగిన సాగునీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా వల్ల ఆ నదుపాయం రాష్ట్ర రైతాంగం ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 25 జిల్లాలను ఆయిల్‌పామ్ సాగుకు అనువైనవిగా నేషనల్ రీ అసెస్మెంట్ కమిటీ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గుర్తించిందని సీఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచే విధానం పై ప్రగతి భవన్‌లో సీఎం సమీక్ష జరిపారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, హార్టికల్చర్ కార్పొరేషన్ ఎండి వెంకట్రామిరెడ్డి, సీడ్ కార్పొరేషన్ ఎండి కేశవులు పాల్గొన్నారు.

విజయవాడలో భారత్ బంద్‌కు భారీ మద్దతు

లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు

విజయవాడ,డిసెబర్8(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ విజయవాడలో భారత్ బంద్ కొనసాగుతోంది. తెల్లవాంజాము నుంచే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లకే పరిమిత మయ్యాయి. హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై ఆందోళనకారులు బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. రాస్తారోకోలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు పాల్గొన్నారు. మరోవైపు బస్సులు రోడ్లపైకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపులో భాగంగా విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వామపక్ష పార్టీ, కాంగ్రెస్ పార్టీలు సహా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు.. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎస్‌యుసిఐసి, ఎస్ఎఫ్ఐ, డివైఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. లెనిన్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన ఏలూరు రోడ్డు మీదుగా పోలీస్ కంట్రోల్ రూం వరకూ.. అక్కడి నుంచి బందరు రోడ్డు మీదుగా కృష్ణా జిల్లా గ్రంథాలయం వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిహెచ్‌బాబూరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జెల్లీ విల్సన్, రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.కేశవరావు, మర్రావు సూర్యనారాయణ, రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పి.జమలయ్య, దడాల సుబ్బారావు, సిఐటియు నుంచి కె.ఉమామహేశ్వరరావు, ఐద్వా నుంచి డి.రమాదేవి, శ్రామిక మహిళా, అంగన్వాడీ, ఆశా నాయకులు కె.ధనలక్ష్మి, తదితరులు, కాంగ్రెస్ పార్టీ నుంచి నరహరిశెట్టి నరసింహారావు, ఆమ్ ఆద్మీ నుంచి పోతిన రామారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ నాయకులు అనిల్, ఎపి ప్రజానాట్య మండలి నుంచి చంద్రనాయక్, కెవిపిఎస్ నుంచి ఆంధ్ర మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ నాయకులు ఎం.సూర్యారావు, సిపిఐ ఎంఎల్ నుంచి జాస్తి కిశోర్ బాబు. పి.ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ నాయకులు, నగర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల దోపిడీని పట్టించుకోని అధికారులు

తరుగు పేరుతో టోపీ పెడుతున్నా కిమ్మనని వైనం

వరంగల్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంటను వ్యాపారులు కిలో తరుగుతో దోచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్పు తేవాలని ఏటా సీజన్‌లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నా మార్పులేదు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏటా రెండు సీజన్‌లలో రైతులు సుమారు కోట్ల మేర దోపిడీకి గురువుతున్నారు. తరుగుపేరుతో రైతులను దోచేస్తున్నారు. ఇలా ఒక్కో రైతు సగటున ఎకరానికి రూ.750 నుంచి రూ.850 వరకు నష్టపోతున్నాడు. ప్రధాన పట్టణాలలో మిల్లులు ఉన్న చోట తరుగు విధానం లేదు. కేవలం కిలో తరుగుతోనే కాంటాలు జరుగుతున్నాయి. లైసెన్సు లేకుండా గ్రామాల్లో వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో రెండు మూడు సార్లు తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి కిలో తరుగుతోనే కాంటాలు వేసుకోవాలని సూచించినా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అన్నదాతకు న్యాయం జరగడంలేదు. ల్ల÷తులు పండించిన పంటను బస్తాలలో బస్తాకు 70 కిలోలు వంతున తూకం వేస్తారు. సంచితో కాంటా వేస్తే.. బస్తా బరువు కింద అదనంగా కిలో అంటే 71 కిలోలు తూకం వేయాలి. వ్యాపారులు అదనంగా రెండు కిలోలు అంటే 72 కిలోలు వేసుకుంటున్నారు. గతంలో కళ్లాలు చేసేటపుడు పట్టలు లేక నేలపై నూర్పిడి చేసేవారు. అపుడు కళ్లాలలో మట్టి, ఎగపోత సమయంలో గాలికి వెళ్లని చెత్త ఎక్కువగా ఉంటుందని కిలో అదనంగా తూకం వేసుకునే వారు. ఇపుడు అలాంటి పరిస్థితి లేదు. వరికోత యంత్రాలతో పనులు చేస్తున్నందున మట్టి, చెత్తా లేకుండా శుభ్రంగా వస్తున్నాయి. తరుగు తీయాల్సిన అవసరం లేదు. వ్యాపారులు పాత పద్ధతిలోనే తరుగు తీసుకుంటున్నారు. కిలో తరుగు వల్ల ఎకరానికి బస్తా తేడా వస్తుంది. ఎరువు కట్ట ఖరీదు నష్టపోతున్నామని అన్నారు. పట్టుపడినా కేసులు లేకుండా పైరవీలు చేసుకుని వ్యాపార దందా సాగిస్తున్నారు. ఈ దోపిడీ అరికట్టాలని మార్కెటింగ్ అధికారులు అంటున్నా అమలు కావడం లేదు.

కేంద్ర వ్యవసాయ చట్టాలు ముమ్మాటికీ శరాఘాతమే

వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపసంహరించుకోవాల్సిందే
భారత్ బంద్‌తో మోడీ ప్రభుత్వం కళ్లు తెరవాలి: లెఫ్ట్

విజయవాడ,డిసెబర్8(ఆర్ఎన్ఎ): కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయచట్టాలు రైతులకు గుదిబండ కానున్నాయని, వారిని కార్పోరేట్లకు బానిసలుగా చేసేవిగా ఉన్నాయని లెఫ్ట్ నేతుల మండిపడ్డారు. లెఫ్ట్ నేతలు మధు,రామకృష్ణ, తదితరులు మాట్లాడుతూ రైతు సాధికారత పేరుతో ఎవరైనా వారితో పంట కొనుగోలుపై ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ చట్టాలు అవకాశమిస్తున్నాయని అన్నారు. దీనితో పాటే ఎపిఎంసి పేరిట మార్కెట్ కమిటీలను రద్దు చేసే మరో చట్టం ఆమోదించారని మండిపడ్డారు.

రైతు మార్కెట్ యార్డులోనే అమ్మాలనే షరతు లేకుండా ఎవరు ఎక్కువ ధర ఇస్తే వారికి అమ్ముకోవడానికి అవకాశమిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పుడు కేంద్రం కనీన మద్దతు ధర(ఎంఎస్‌పి) ప్రకటిస్తే, మార్కెట్ యార్డు వుంటే కూడా రైతు దళారులకు బవుతున్నారు. కనీస ధర పొందలేక చితికిపోతున్నారు. అలాంటిది నిర్దిష్టమైన అమ్మక వ్యవస్థ కానీ, నిర్ణయించిన కనీస ధర గాని లేకుండా కంపెనీలుతో బాగా ఒప్పందాలు చేసుకోమని చెప్పడం ఎంత హాస్యాస్పదం అన్నారు. పక్కనున్న పట్టణ కేంద్రాలకే తెచ్చుకుని అమ్ముకోలేని రైతులు కళ్లాలో తెగనమ్ముకుంటున్నారు. వారు దేశంలో ఎక్కడైన పంటలు అమ్ముకోవచ్చని అనడం ఎంతవరకు సమంజసమని లెఫ్ట్ నేతలు అన్నారు. అమ్మకాలు జరక్క ధర లభించక ల్లడిల్లే రైతు ఎక్కడో అంబానీతో అదానీతో లేదంటే వాల్‌మార్ట్‌తో చర్చలు జరిపి ఎక్కువ ధర తెచ్చుకోగలరో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఈ సమస్యపై ఉద్యమం జరుగుతన్న తీరు వ్యవసాయ సంక్షోభ తీవ్రతను కేంద్ర చట్టాల హానిని తెలియజేస్తుందన్నారు. కొత్తగా చేసిన మూడు వ్యవసాయ చట్టాలు, వాటితో పాటు విద్యుచ్ఛక్తి సవరణ చట్టం మొత్తంగా వెనక్కు తీసుకోవలసిందే తప్ప అరకొర అతుకులు ఆమోదించేది లేదన్నది రైతన్నల ధృఢ వైఖరిగా గుర్తించాలన్నారు. నిత్యావసరాల చట్టాన్ని సవరించి అవసరమైన సరుకులను ఎలాటి హద్దు లేకుండా తరలించుకోవచ్చనీ, ఎంత భారీగానైనా నిల్వ చేసుకోవచ్చనీ అవకాశం కల్పించే చట్టం ఇందులో ఇమిడి ఉందన్నారు. వ్యాపారులకు కంపెనీలకు ఈ అవకాశం ఇస్తే వారు తక్కువ వున్న చోటికే పోవడం, మొత్తం కొని నిల్వ చేసి కృత్రిమంగా ధరలు పడగొట్టడం జరగదా అని ప్రశ్నించారు. అవసరమైన చోట గాక లాభం ఎక్కువగా వచ్చేలా వారు ప్రవర్తించరని గ్యారెంటే ఏమిటన్నారు. కనుక ఈ మూడు చట్టాలు పేరు ఏం చెప్పినా ఏం పూదరగొట్టినా వాస్తవంలో బడాబాబుల కోసం తప్ప బడుగు రైతు కోసం, గ్రామీణ శ్రామికుల కోసం ఉద్దేశించినవి కావన్నారు. కిసాన్ యోజన ఫసల్‌బీమా, ఎప్పుడూవుండే బ్యాంకు రుణాలు హామీతోనే సరిపోయింది. పులిమీద పుట్రలా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి తీరాల్సిందేనన్న కేంద్ర హుకుం ఉచిత విద్యుత్‌పై కత్తిలా వేల్లాడుతున్నది. అందుకే ఈ నాలుగు శాసనాలు మార్చి తీరాల్సిందేనని రైతులు పోరాడుతున్నారని అన్నారు. ఇందులో దేశ ఆహార భద్రతకు సంబంధించిన అంశాలు కూడా విస్మరించరానివి. పౌష్టికాహారం లేక గ్రామీణ ప్రజలు ముఖ్యంగా తల్లులు కునారిల్లి పోతున్నారు. ఎఫ్‌సిఐగోడౌన్లలో మక్కిపోయే ఆహార పదార్థాలను కరోనా లాక్‌డౌన్ సమయంలో పేదకు ఉచితంగా ఇవ్వాలని సుప్రీం కోర్టు చేసిన సూచనను ఎందుకు పట్టించుకోలేదన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థల్లో చేరన నాటి నుంచి మన వ్యవసాయ రంగంపై జరుగుతున్న దాడి పరాకాష్టకు చేరడానికి ఈ మూడు చట్టాలు నిదర్శనమన్నారు. అందుకే ఈ వినాశకర శాసనాలను ఉపసంహరించే వరకూ పోరాటం ఆగదన్నారు. భారత్ బంద్ తర్వాతనైనా మోడీ ప్రభుత్వం ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలని అన్నారు.

అన్నదాతల వెన్నువిరిచే కొత్త చట్టాలను రద్దు చేయాలి

పెద్దపల్లి, డిసెబర్8: జిల్లాలోని ధర్మారం మండల కేంద్రంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అవలంభిస్తున్నరైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతాంగం చేపట్టిన భారత్ బంద్ సీఎం కేసీఆర్ సంపూర్ణ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ వేలాది మంది రైతులు వెంట రాగా రాస్తారోకో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అన్నదాతల వెన్ను విరిచే కొత్త చట్టాలను బేషరతుగా కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే మోదీ ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావాలి

కామారెడ్డి,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీల సమన్వయంతో ఓడీఎఫ్ పనుల్లో వేగం పెంచాలని పంచాయితీ అధికారులు తెలిపారు. మండలాల్లో ఓడీఎఫ్ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో ఉండి పనులు పరిశీలించాలన్నారు. నిధుల సమస్య లేనందున ఆన్‌లైన్ నమోదు వంటి పనులు పూర్తి చేసుకోవాలని అన్నారు. ఉదయమే 6 గంటలకు స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు చేరుకొని ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కులను వెంటనే పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని సంక్షేమ శాఖల అధికారులు తమ పరిధిల్లోని హాస్టళ్లకు నీటి వసతి కోసం మిషన్ భగీరథ కనెక్షన్‌లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత కోసం రిక్షాలను వినియోగించాలని తెలిపారు.

కుందుర్తి రైతులకు ఊరట

–ఎమ్మెల్యే షకీల్ చొరవతో సమస్యకు పరిష్కారం

కామారెడ్డి,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కందకుర్తి ఎత్తిపోతల పథకం కింద రైతులు పండించే పంటలో గుంట భూమి కూడ ఎండ నీయకుండా సాగునీరందేలా ఎమ్మెల్యే షకీల్ చర్యలు తీసుకున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డకా రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన ముందుకు సాగుతుందని ఆయన ఉన్నారు. రైతులకు సాగునీరందించేందుకు అవకాశం ఉన్న కాలువ పుడికతతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే షకీల్ సూచించారు. కందకుర్తి లిఫ్ట్ ద్వారా నీలా,కందకుర్తి గ్రామాలకు చెందిన వందల ఎకరాల భూమి సాగవుతోంది. గోదావరినదిలో నీరు పుష్కలంగా ఉన్నా కాలువలో మట్టి చేరడంతో సాగు నీరందకుండా పోతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగా ఆయన చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయకట్టు రైతులు పండించే శనగ,పొగాకు పంటలను సాగు చేసేందుకు అవకాశం ఏర్పడింది. కందకుర్తి గోదావరి నది ఒడ్డున నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రధాన కాలువ ద్వారా పంటలకు సాగునీరందించేలా పూడికతీత పనుల కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారని రైతులు పేర్కొన్నారు. దీంతో పంట పొలాలకు సాగునీరందించే పనులను రైతులు ప్రారంభించారు.

గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య

పెద్దపల్లి,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న దుబ్బలక్ష్మి (50) అనే మహిళ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని లోని సమ్మక్క సారక్క గ్దదెల వద్ద గల స్నానాల ఘాట్ వద్ద గోదావరి నదిలో మహిళ మృతదేహం తేలుతూ కనిపించడంతో స్థానికులు బయటకు తీశారు. పోలీసులు మృతురాలిని దుబ్బ లక్ష్మిగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే..రామగుండం అయోధ్య న

కార్పొరేట్ ప్రయోజనాల కోసమే వ్యవసాయ చట్టాలు

పాలమూరు ఆందోళనలో పాల్గొన్న మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రాస్తారోకోలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసేందుకు కొత్త వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ ఈ చట్టాలను వ్యతిరేకిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం దృష్ట్యా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ఈ మూడు చట్టాలను కేంద్రం బేషరతుగా వెనక్కి తీసుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

భేషరత్తుగా కేంద్రవ్యవసాయ బిల్లును రద్దు చేయాల్సిందే

కార్పొరేట్ శక్తులతో రైతులకు ప్రమాదం
అన్న దాతల కంట కన్నీరు దేశానికి మంచిదికాదు
టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ధర్నా

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి): బడా వ్యాపార రైతులకు, కార్పొరేటర్లకు మరింత సంపద చేకూర్చే రైతుల సాధికారత, భవిష్యత్తుకు పెను ప్రమాదం తలపెట్టే కేంద్ర నూతన మూడు వ్యవసాయ బిల్లులను భేషరత్తుగా వెంటనే రద్దు చేయాల్సిందేనని వేములవాడ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఫులకంరాజు డిమాండ్ చేశారు

టీఆర్ఎస్ వేములవాడ పట్టణ, అర్బన్, రూరల్ శాఖఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, సీనియర్ పార్టీ నాయకులు వేములవాడ పట్టణంలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించి,మూలవాగు బిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు .పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తెరాస పట్టణ అధ్యక్షుడుఫులకంరాజుమాట్లాడుతూ అన్నదాతల కంట కన్నీరు దేశానికి మంచిది కాదన్నారు.

ఆరుగాలం ఎండనక, వాననక కష్టించి తమ స్వేదంతో ప్రజలకడుపుల నింపే రైతుల కడుపు మీద తనే ఇటువంటి బిల్లులు వ్యవసాయానికి కాకుండా దేశ వ్యవసాయ రంగానికి, రైతాంగానికి మధ్య శిలా వంటిదన్నారు. ఎముకలు కొరికే చలిలో తమ చిన్నారులతో సహా ఢిల్లీలో తమ ట్రాక్టర్లను నివాసం గా మార్చుకుని ఆరునెలలు సైతం ఉద్యమం చేయడానికి రైతులు ఉక్కు సంకల్పంతో ఆ వ్యవసాయ బిల్లు ఎంతో బూటకమో, నష్టదాయకమో స్పష్టంచేస్తున్నాయన్నారు.

కేంద్రం నూతన వ్యవసాయ బిల్లుల రూపకల్పన వెనుక కార్పొరేట్ల శక్తులు మరింత దోచుకునేందుకు, ప్రభుత్వం తన సంక్షేమ బాధ్యతల నుండి తప్పుకునేందుకు రచించిన ప్రణాళిక ఉందన్నారు.

నూతన వ్యవసాయ బిల్లుల సవరణలతో కూడా లాభం లేదని, భేషరతుగా వీటిని రద్దు చేయాలని రైతుల ఉద్యమానికి అన్ని రకాలుగా తమ పార్టీ అండ దండలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థం మాధవి రాజు , వైస్ చైర్మన్ మధు రాజేందర్ ,జడ్పీటసీ మ్యాకలరవి , సెస్ డైరక్టర్లు రామతీర్థ పు రాజు,జడల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు, వైస్ చైర్మన్ఉరడి ప్రవీణ్ , కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్ ,సిరిగిరి రామ్ చంద్రం , శంకర్, గోలి మహేష్, కోఆప్షన్ మెంబర్ బాబును ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిర్ మహమ్మద్ , టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ,భాస్కర్ రావు ,ప్రసాద్ రావు ,పాలాన నరేందర్,బాబు ,క్రాంతి ,వంగల శ్రీనివాస్ ,అన్నారం శ్రీనివాస్,రెడ్డి వేణి పర్శరాములు,నరేష్ ,ఉర డి రాంరెడ్డి, అంజాద్ పాషా, తదితరులు పాల్గొన్నారు

7వ డివిజన్లో స్వచ్ఛ సర్వేక్షన్‌కు అపూర్వ సందన

కరీంనగర్. డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి):స్వచ్ఛ సర్వేక్షన్ 2021 కార్యక్రమంలో భాగంగా 47వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ 'మహమ్మద్ శర్ఫుద్దీన్' ఆధ్వర్యంలో మంగళవారం తడి.. పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ లోని శాసహబ్ మొహాల్ల, గాయత్రీ నగర్, రోజ్ టాకీస్ లైన్, కమాన్ టూ బైపాస్ మెయిన్ రోడ్ లో గడప గడప తిరుగుతూ తడి చెత్తను.. పొడి చెత్తను వేరుగా వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల నుంచి డివిజన్ లో అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఎఇ వెంకట్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ అలీమ్, మెప్మా ఆర్పీలు రమ, జ్యోతి, జవాన్ ఫసియుద్దీన్, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

చందుర్తిలో కాంగ్రెస్ పార్టీ రాస్తారోకో ధర్నా

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో ధర్నా చేపట్టారు, జడ్పిటిసి నాగం కుమార్ ఆధ్వర్యంలో వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారి ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా జడ్పిటిసి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సంఖ్యా బలముందికదా అని తెచ్చిన మూడు సాగు చట్టాలను నిరసిస్తూ రైతాంగం గత 12 రోజులు గా చేస్తున్న పోరు లో భాగంగా అఖిలపక్షం చేపట్టిన భారత్ బంద్ కు మద్దతు గా ఏఐసిసి టి.పి.సి.సి ఇచ్చిన పిలుపు మేరకు చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు, కేంద్రం తెచ్చిన సాగు చట్టాలు అక్రమం,రాజ్యాంగ విరుద్ధమని,దేశ హితం దృష్ట్యా ఈ చట్టాల అమలు నిలిపేస్తూ కేంద్రం ఓ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు , బంద్ కు మద్దతు గా వ్యాపార సంస్థలు, హోటళ్లు పెట్రోలు బంక్ లు స్వచందంగా మూసి వేసి వేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో

జిల్లా కాంగ్రెస్ పార్టీ,ప్రధాన కార్యదర్శి గొట్టె ప్రభాకర్ , ఎంపిటిసి లు పులి రేణుక సత్యం, మ్యాకల గణేష్ నాయకులు దేవస్వామి, చంటి ప్రసాద్,కట్కూరి చంద్రయ్య, లింగంపెల్లి అజయ్,ఎగోళం శ్రీనివాస్,దారం చంద్రం,ఒరగంటి తిరుపతి, మర్రి మల్లేశం,లింగంపెల్లి అశోక్,నాగం శ్రీనివాస్,గంట మల్లేశం,సంతపురపు బాలు గసికంటి ప్రభాకర్, వులిచే గిరి ప్రసాద్ బొంత సురేందర్ రావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

బ్రిటన్‌లో అందుబాటులోకి కరోనా వ్యాక్సిన్

ఫైజర్ వ్యాక్సిన్ వేయించుకున్న బ్రిటన్ బామ్మ

లండన్,డిసెంబర్ 8(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న కోవిడ్ వ్యాక్సీన్ ను బ్రిటన్ తమ దేశంలో పంపిణీకి శ్రీకారం చుట్టింది. తద్వారా ప్రపంచంలో తొలిసారి కరోనా వ్యాక్సిన్ ఇవ్వడం మొదలుపెట్టిన దేశంగా బ్రిటన్ నిలిచింది. తొలి దశలో 50 హాస్పిటళ్లలో ఫైజర్ వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచారు. ముందుగా 80 ఏళ్లు పైబడిన వారు, హెల్త్ కేర్ వర్కర్లు, నర్సింగ్ హోం సిబ్బందికి బ్రిటన్ టీకాలు ఇస్తోంది. తొలి కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న వ్యక్తిగా మార్గరేట్ కీనన్ అనే 90 ఏళ్ల వృద్ధురాలు రికార్డ్ క్రియేట్ సృష్టించారు. ప్రపంచంలోనే తొలి టీకాను తనకే ఇవ్వడం ఎంతో గర్వంగా భావిస్తున్నానని కీనన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్ కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6.30 గంటలకు కొవెంట్రీ స్థానిక ఆస్పత్రిలో ఆమెకు టీకా తొలి డోస్ ఇచ్చారు. మూడు వారాల వ్యవధిలో కరోనా వ్యాక్సిన్‌ను రెండు డోసులుగా ఇస్తారు. కోవిడ్-19 సోకకుండా ఈ వ్యాక్సిన్ 95 శాతం రక్షణ కల్పిస్తుంది. ఈ వ్యాక్సిన్ వేయించుకున్న వాలంటీర్లలో సైడ్ ఎఫెక్ట్స్ స్వల్పంగానే ఉన్నాయని, వెంటనే తగ్గిపోయాయన్గి ÷జైర్ తెలిపింది. రెండో డోస్ ఇచ్చిన తర్వాత సైడ్ ఎఫెక్ట్‌ల తీవ్రత ఎక్కువగా ఉందని, 3.8 శాతం మంది వాలంటీర్లలో అలసట కనిపించగా.. 2 శాతం మంది తలనొప్పి వచ్చిందని ఫిర్యాదు చేసినట్టు వెల్లడించింది.. వయసు మీదపడిన వారిలో ఈ సైడ్ ఎఫెక్ట్స్ ఒకింత ఎక్కువగా ఉన్నాయని వివరించింది.. రెండో ఇంజెక్షన్ వేయించుకున్న వారం తర్వాత ఈ వ్యాక్సిన్ కోవిడ్ సోకకుండా నిరోధించిందని కూడా తెలిపింది. అంటే తొలి టీకా వేయించుకున్న దాదాపు నెల రోజుల తర్వాత.. వ్యాక్సిన్ ప్రభావం ఉంటుంది. టీకా వేయించుకున్న వ్యక్తి ద్వారా ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందుతుందా లేదా అనేది ఇంతకు వరకు క్లినికల్ ట్రయల్స్‌లో తెలియలేదు. హెపటైటిస్-ఏ లాంటి వ్యాక్సిన్లు ఇలాంటి రక్షణ కల్పిస్తాయి. కానీ మిగతా వ్యాక్సిన్లు కల్పించవు. వ్యాక్సిన్ వేయించుకున్న వ్యక్తికి ఎంత కాలం వరకు ఇన్ఫెక్షన్ సోకదనేది మరి కొన్ని నెలల వరకు స్పష్టంగా తెలీదు. కాబట్టి పబ్‌లకు వెళ్లడం, ఎక్కువ మందిని కలవడం లాంటివి చేయొద్దని వైద్యులు సూచించారు. ఇదిలా ఉంటే వైరస్ సంక్రమణను వ్యాక్సిన్ అడ్డుకుంటుందనడానికి ఖచ్చితమైన ఆధారాల్లేవని, ఏ వ్యాక్సిన్ కూడా వంద శాతం ప్రభావం చూపదని డాక్టర్లు చెబుతున్నారు. కాబట్టి వ్యాక్సిన్ వేయించుకున్నప్పటికీ నిరంతరం అప్రమత్తంగా ఉండటం, మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, భౌతిక దూరం పాటించడం తప్పనిసరిగా చేయాలని సూచిస్తున్నారు.

సన్నాలకు మద్దతు ఎందుకు ఇవ్వరు?

మంత్రి కొప్పుల కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్

కరీంనగర్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): కరీంనగరంలో మంత్రి కొప్పుల ఈశ్వార్ కాన్వాయ్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలంటూ కాంగ్రెస్ నేత మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అదే సమయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ అటువైపు వెళుతుండగా అడ్డుకున్నారు. మంత్రి కాన్వాయ్ ఎదుట బైఠాయించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.

భారత్ బంద్ సందర్భంగా కరీంనగంలో రెండు ఘటనలు జరిగాయి. కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉదయం బస్టాండ్ వద్ద ధర్నా చేస్తుండగా టీఆర్ఎస్ కార్యకర్తలు వచ్చారు. దీంతో ధర్నాలో పాల్గొనే నైతిక హక్కు మీకెక్కడిదంటూ వారిపై పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మరోవైపు భారత్ బంద్‌లో పాల్గొనడానికి కరీంనగర్ నుంచి ధర్మపురివైపు వెళుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ కాన్వాయ్‌ను చొప్పదండి దగ్గర మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ రెండు ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి.

బంద్‌లో పాలొనే హక్కు టీఆర్ఎస్‌కు లేదు

సన్నాలకు మద్దతు ధరలు ఇవ్వకుండా డ్రామాలు మండిపడ్డ కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్

కరీంనగర్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): జిల్లాలో భారత్ బంద్ ఉద్రిక్తంగా మారింది. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు రచ్చ రచ్చ చేశారు. భారత్ బంద్‌లో టీఆర్ఎస్ పార్టీ పాల్గొనడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. భారత్ బంద్‌లో టీఆర్ఎస్ ఎలా పాల్గొంటుందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇరు పార్టీల నేతల మధ్య తోపులాట జరిగింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఇరు పార్టీల నేతలను అడ్డుకున్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల ఘర్షణతో కరీంనగర్ ప్రధాన బస్టాండ్ ఎదుట టెన్షన్ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...బంద్‌లో పాల్గొనే నైతిక హక్కు టీఆర్ఎస్ లేదన్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు మద్దతు ధర ఇవ్వని కేసీఆర్.. భారత్ బంద్‌కి మద్దతు ఇవ్వడమా అని యెద్దేవా చేశారు. కేంద్రం తెచ్చిన చట్టాలు రైతులకు ఉరితాళ్లే.. దేశమంతా బంద్ నడుస్తోందని పొన్నం తెలిపారు.

జగిత్యాలలో మక్క రైతుల ఆందోళన

జగిత్యాల,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మక్క రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని జిల్లాలో మొక్కజొన్న రైతులు ఆందోళనకు దిగారు. పంట కొనాలని రోడ్డెక్కితే తమను అరెస్ట్ చేసినట్టుగానే.. బంద్ కుపిలుపునిచ్చిన టీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మిపూర్‌లో రైతు ఐక్యవేధిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మొక్కజొన్న కొనాలంటే తమను అరెస్ట్ చేశారని.. టీఆర్ఎస్ నేతలను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఇక్కడ పంటలను కొనలేని వారు బంద్ జరపడంలో అర్థం లేదన్నారు. మక్కలను, సన్నాలను కొనాలని, రైతులపై కేసులు రద్దు చేయాలని అన్నారు.జూబీ

సాగుచట్టాలు తేనెపూసిన కత్తి లాంటివి

సన్నాలకు మద్దతు ధరలు రాకుండా కేంద్రం అడ్డుపుల్ల
తూప్రాన్ వద్ద ధర్నాలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు

మెదక్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ):కేంద్రం తెచ్చిన కొత్త సాగు చట్టాలు తేనె పూసిన కత్తి లాంటివి.. ఈ చట్టాలు రైతుల నడ్డి విరిచే విధంగా ఉన్నాయని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. తుప్రాన్ వద్ద రైతులకు మద్దతుగా నిర్వహించిన నిరసన ర్యాలీలో హరీష్ రావు పాల్గొని ప్రసంగించారు. సాగు చట్టాలను వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హరీష్ రావు తేల్చిచెప్పారు.

సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఊరురా తీర్మానాలు చేయాలన్నారు. 53 ఏళ్లుగా అమలవుతున్న మద్దతు ధరను బీజేపీ కాలరాస్తోందని మండిపడ్డారు. ఆనాడు లాల్ బహదూర్ శాస్త్రి, బాబూ జగ్జీవన్ రాం తెచ్చిన మద్దతు ధర విధానానికి మోదీ ప్రభుత్వం పంగనామాలు పెట్టిందని ధ్వజమెత్తారు. స్వామినాథన్ కమిటీ సిఫారాసుల ఆధారంగా రైతు పెట్టుబడితో పాటు 50 శాతం మార్జిన్ కింద మద్దతు ధర నిర్ణయించాలని సూచిస్తే.. ఉన్న ధర బీజేపీ ఊడగొడుతోంది. సన్నరకాల రైతులకు అన్యాయం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఉసురు తగిలి బీజేపీ ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. దేశంలో 23 పంటలను మద్దతు ధరకు కొంటున్నారు.

మద్దతు ధరలు పెంచాలని రైతులు కోరుతున్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం అసలు మద్దతు ధర లేకుండా చేస్తుందని మండిపడ్డారు. రైతులు గొంతెమ్మ కోరికలు కోరట్లేదు.. వారి జీవితాలను నాశనం చేయొద్దు అని హరీష్ రావు పేర్కొన్నారు. కొందరు బీజేపీ నేతలు సాగు చట్టాలు ఒక విప్లవం అంటున్నారు.. కానీ ఆ చట్టాలు రైతుల వినాశనానికి దారి తీస్తాయని పేర్కొన్నారు. లాఠీ దెబ్బలు, వాటర్ క్యానన్‌లతో నీరు కొడుతుంటే రైతులు, ఆడవారు, చిన్న పిల్లలు ఎదురొడ్డి చలిలో నిరసన చేస్తుంటే బ్రిటన్ ప్రధాని, బీబీసీ న్యూస్ స్పందించింది కాని బీజేపీ ప్రభుత్వం స్పందించడం లేదు అని హరీష్ రావు ధ్వజమెత్తారు.

హైకోర్టులో ఎపి సర్కార్‌కు చుక్కెదురు

పంచాయితీ ఎన్నికలపై స్టే ఇవ్వలేమని వెల్లడి
విచారణ 14కు వాయిదా వేసిన న్యాయస్థానం

అమరావతి,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): ఎపీ హైకోర్టులో జగన్ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక ఎన్నికల పక్రియను ప్రస్తుత పరిస్థితుల్లో నిలుపుదల చేయలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్టే ఇవ్వడం సాధ్యం కాదని.. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఎన్నికల కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈనెల 14కు వాయిదా వేసింది. ఫిబ్రవరిలో జరపతలపెట్టిన స్థానిక ఎన్నికలను నిలిపివేయాలని హైకోర్టును ప్రభుత్వం ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ ప్రకటన విడుదల చేయడంతో.. ఈ పక్రియను వెంటనే నిలివేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలని ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు మూడు నెలల్లోగా నిర్వహించాలని 2018లోనే హైకోర్టు ఎన్నికల కమిషన్ ను ఆదేశించిందన్నారు. ఎన్నికల వాయిదాకు అప్పటి ప్రభుత్వం పేర్కొన్న కారణాలను హైకోర్టు తోసిపుచ్చిందన్నారు. కానీ కోర్టు ఆదేశించినట్లు ఎన్నికల నిర్వహణలో కమిషన్ విఫలమైం దని.. అనంతరం 2020లో ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టిన ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఎన్నికలను అర్ధాంతర ంగా వాయిదా వేసిందన్నారు. ఆ తర్వాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఫిబ్రవరిలో ఎన్నికలు జరపాలని నిర్ణయం తీసుకుందని కోర్టుకు వివరించారు. ఎన్నికలు నిర్వహించే ముందు రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ప్రభుత్వం తరపున శ్రీరామ్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం ఎన్నికలు వద్దనేందుకు సరైన కారణం ఉందని, ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని, దీని తరువాతే మిగిలినవని తేల్చి చెప్పారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు విచారణ చేపట్టిన హైకోర్టు ఎన్నికలపై స్టే ఇవ్వడం సాధ్యం కాదని తీర్పునిచ్చింది. కౌంటర్ దాఖలు చేసేందుకు ఎన్ఈసీకి సమయమిస్తూ తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది.

మక్కలు, సన్నాలను కొనకుండా ధర్నాలా?

వ్యవసాయ చట్టాలపై బహిరంగ చర్చకు రావాలి
కెసీఆర్, టిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ ఎంపి అర్వింద్

నిజామాబాద్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ రైతుల రక్తం తాగే బ్రోకరని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చీఫ్ మినిస్టర్‌లా కాకుండా చీఫ్ బ్రోకర్‌లా కెసిఆర్ వ్యవరిస్తున్నాడని అన్నారు. హరీష్, కవిత సంపాదించింది కార్పొరేట్ కాలేజీల్లో పెడుతున్నారన్నారు.

రైతులను సన్నాలు వేయమని చెప్పి మద్దతుధర ఇవ్వటం లేదన్నారు. ధర్నా చౌక్ ఎత్తేసిన కేసీఆర్ ఇప్పుడు ధర్నా చేస్తాడా అని ప్రశ్నించారు. రైతుల గురించి కేసీఆర్ మాట్లాడడం ఈ దశాబ్దపు జోక్ అని ధర్మపురి అర్వింద్ అన్నారు.

బురుద గుంటలో బొర్లే పందులు కేసిఆర్ కేటీఆర్, హరీష్ లు అని అన్నారు. రైతు చట్టంపై ముఖ్యమంత్రి, మంత్రులతో చర్చకు సిద్ధమన్నారు. మొగ పుట్టుక పుట్టినోడు ఎవడైన కొత్త వ్యవసాయ చట్టాలపై బహిరంగ చర్చకు రావాలన్నారు. చర్చలో కూడా తాను ఒక్కడినే ఉంటానన్నారు. ఎలా నష్టం జరుగుతుందో చెప్పాలన్నారు. ఈ చట్టంతో రైతులకు ఎలా లాభం జరుగుతుందో తాను చెప్తానన్నారు. తెలంగాణ రైతులు సీఎం కేసీఆర్‌ను త్వరలో బట్టలూడదీసి కొడ్తారన్నారు.

ఉద్యమం అంటే కేసీఆర్ కు చూపిస్తామన్నారు. గడాఫీకి పట్టిన గతే కేసీఆర్‌కు పడ్తోందన్నారు. టీఆర్ఎస్ తెలంగాణలో ఫేక్ ఉద్యమం నడుపుతోందన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో దిమ్మతిరిగింది? కేటీఆర్ కు సరిపోలేదేమో? అని అన్నారు. మక్క కబ్జాలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ రైతు కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయలేదో ప్రభుత్వం చెప్పాలన్నారు?. సన్నాలను ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయటం లేదని ప్రశ్నించారు. దగ్గు, జలుబు వస్తే కేసీఆర్ కార్పొరేట్ ఆసుపత్రైన యశోదాకే ఎందుకు వెళ్తున్నాడన్నారు.

కేటీఆర్, కవితలు కమిషన్ ఇవ్వకపోవటం వలనే ఎమ్మెల్యే, మంత్రులు నిర్వచనాన్నే మార్చివేశారన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదాన్ని.. పాస్ పుస్తకం ఉన్నోడిదే భూమి అనే పరిస్థితిని కేసీఆర్ తీసుకొచ్చాడన్నారు. దళారీలు మాత్రమే ఉద్యమం చేస్తున్నారు .. ఢిల్లీ ఉద్యమంలో రైతులెవరూ లేరన్నారు. తెలంగాణలో పండుతోన్న పసుపును కాదని.. కమిషన్ కోసమే ప్రభుత్వం పసుపును దిగుమతి చేసుకుంటోందన్నారు. వేల కోట్ల రూపాయల కమీషన్లు పోతున్నాయనే రైతు చట్టాలపై ప్రాంతీయ పార్టీల ఏడుస్తున్నాయన్నారు. ఇదిలావుంటే నెలలు గడిచినా మహిళ హత్య కేసులో పురోగతి లేదని ఎంపీ ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. హత్య కేసును పోలీస్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లానని గుర్తుచేశారు. హత్యకేసులో అమాయకుడిని ఇరికించి పోలీసులు టార్చర్ చేశారని మండిపడ్డారు. పోలీసుల వేధింపులు తాళలేక గంగాధర్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన ఆరోపించారు. పోలీసుల వైఖరిపై హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాస్తాన్నారు.

చందుర్తిలో బంద్ విజయవంతం

- టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలో రైతుల పై జరిగిన దాడికి నిరసనగా భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా టిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు చందుర్తి మండలంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షులు మరాటి మల్లిక్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ శ్రేణులు దుకాణాలను, వ్యాపార సంస్థలను, మూయించారు, ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను బస్టాండ్ కూడలిలో దగ్ధం చేశారు, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతు కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన రైతు బిల్లులను, చట్టాలను రద్దు చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ అబ్రహం, నాయకులు భైరగోని రమేష్, మ్యాకల ఎల్లయ్య, ఈర్లపల్లి రాజు, దప్పుల అశోక్, కమలాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు, ఇలా మిగతా గ్రామాల్లో కూడా కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు,

స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్ కోసం హెచ్‌సీయూ దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 8: స్టార్టప్ లాంచర్ ప్రొగ్రాం కోసం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని టెక్నాలజీ ఇంక్యుబేటర్లతో కలిసి ది ఎంటర్‌ప్రెన్యూర్ జోన్(టీఈజెడ్) దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ డిసెంబర్ 20. ఆన్‌లైన్ వారాంతపు మెంటర్‌షిప్ సెషన్‌లు, స్టార్టప్ ఇంక్యుబేషన్, కన్సల్టెన్సీ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయక సేవల కలయికగా రూపొందించబడిన ఈ కార్యక్రమంలో 16 జ